వలంటీర్లపై గురుతర బాధ్యత

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- నూతన వలంటీర్లకు నియామక పత్రాల అందజేత


ఎమ్మెల్యే నాగిరెడ్డితో నియామక పత్రాలు అందుకున్న వలంటీర్లు

గాజువాక: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నియమించిన వలంటీర్లు బాధ్యతగా, నిజాయితీగా ప్రజలకు సేవలను అందించాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. ఇటీవల ప్రభుత్వం నియమించిన 20 మంది వలంటీర్లకు ఆయన మంగళవారం నియామక పత్రాలను అందజేశారు. గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ వలంటీర్లపై ఎంతో బాధ్యత ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తేవాలన్నారు. అన్ని పథకాలను ముఖ్యమంత్రి ఎంతో పారదర్శకంగా అమలు చేస్తున్నారని, వాటిని అర్హులకు చేరవేయడంలో ఎటువంటి అవకతవకలు లేకుండా వలంటీర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, రెవెన్యూ అధికారి రామనారాయణ, సూపరింటెండెంట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యాశాఖా మంత్రికి వినతి


మంత్రి బొత్స సత్యనారాయణకు సమస్యలు వివరిస్తున్న నాయకులు

అగనంపూడి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణకు పీఆర్‌టీయూ నాయకులు వినతిపత్రం అందించారు. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ద్వారా విశాఖలోని మంత్రి నివాసం వద్ద ఆయన్ను కలిసి, సమస్యలు తెలియజేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు, జీవో 117 రద్దు తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రిని కలిసిన వారిలో విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీను, సీహెచ్.పెద్దినాయుడు, నాగేశ్వరరావు, సీహెచ్.రామినాయుడు తదితరులున్నారు.

ఆరోగ్య కేంద్రానికి నెబులైజర్స్ అందజేత


డాక్టర్ రమేష్‌బాబుకు నెబులైజర్స్ అందిస్తున్న పీబీఆర్ ట్రస్టు సభ్యులు

పెదగంట్యాడ: పీబీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నెబులైజర్స్ అందజేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబుకు ట్రస్ట్ ప్రతినిధులు పులి వెంకట రమణారెడ్డి, శ్రీరామ్ రెడ్డి, సురేష్ రెడ్డి లక్ష్మీబాయ్ మంగళవారం వీటిని అందజేశారు. డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ చిన్న పిల్లలు శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్నప్పుడు ఈ పరికరం ఉపయోగపడుతుందన్నారు. వీటిని అందజేసిన ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

హోమియో ఆస్పత్రి వైద్యాధికారిగా కళావతి



అగనంపూడి: అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆవరణలోని హోమియో ఆస్పత్రి వైద్యాధికారిగా డాక్టర్ కె.కళావతి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కళావతి ఇప్పటి వరకు కె.కోటపాడు హోమియో ఆస్పత్రి వైద్యురాలుగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆమె మాట్లాడుతూ అగనంపూడి ఆస్పత్రి పరిధిలో గ్రామాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. హోమియో వైద్యం ద్వారా అనేక జబ్బులు నయం అవుతున్నాయని, నమ్మకంతో వచ్చే వారికి తప్పకుండా ఫలితం ఉంటుందని తెలిపారు. ఆస్పత్రిలో సేవలు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా అగనంపూడికి చెందిన పలు సంఘాల నాయకులు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో వి.వరహాలు,సత్యనారాయణ, రమణ, చందు తదితరులు పాల్గొన్నారు.

కుంచుమాంబ అమ్మవారికి కుంకుమపూజలు


అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: మండలంలోని పెదగంట్యాడలో కొలువుదీరిన కుంచుమాంబ అమ్మవారికి శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, విజయకుమారి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులతో ప్రత్యేకంగా కుంకుమార్చనలు చేయించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

మొక్కలు నాటడంపై త్వరలో మెగా ప్రాజెక్టు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

గాజువాక: గాజువాక జోన్‌లో మొక్కలు నాటేందుకు త్వరలో చేపట్టనున్న మెగా ప్రాజెక్టుపై అధికారులు దృష్టి సారించాలని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోన్‌లో మొత్తం 2 వేల మొక్కలను నాటేందుకు ప్రణాళిక ఉందన్నారు. ఇప్పటికే వివిధ నివాస ప్రాంతాల్లో 140 వీధులను గుర్తించినప్పటికీ అందులో మొక్కలు నాటేందుకు వీలుగా ఉన్న వీధులను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని మెగా ప్రాజెక్టుగా ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా కసరత్తు చేసి నివేదిక తయారు చేయాలని సూచించారు. ఈ ప్రాజెక్టుపై ముందుగానే అప్రమత్తంగా వ్యవహరించాలని, జీవీఎంసీ కమిషనర్ నుంచి ఉత్తర్వులు రాగానే పని ప్రారంభించే విధంగా సంసిద్ధం కావాలన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్‌బాబు, సహాయ ఇంజినీర్లు వెంకటరావు, ఎంఆర్ఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్టార్టప్‌లపై దృష్టి సారించాలి


శంకరరావును సత్కరిస్తున్న విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు

అగనంపూడి: భారతదేశం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తోందని ఐఎఫ్‌సీఐ సీఈవో ఇమంది శంకరరావు అన్నారు. ప్రతీ విద్యార్థి నైపుణ్యాభివృద్ధితో పోటీ ప్రపంచంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రయత్నించాలన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో స్టాటజీ, స్టార్టప్‌లపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తనకు ఉపాధి దొరుకుతుందనే పరిస్థితి నుంచి తాను ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలంటే స్టార్టప్‌లపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ సీఈవో శ్రీకాంత్, రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ సుధాకర్, అర్చనా ఆచార్య, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్–3పై విద్యార్థులకు అవగాహన


చంద్రయాన్ సాఫ్ట్ ల్యాండింగ్ కావాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గాజువాక: చంద్రయాన్–3పై స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చంద్రయాన్–3 ఆవిష్కరణ మొదలుకొని బుధవారం ల్యాండింగ్ కానున్న సందర్భం వరకు వివిధ అంశాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జ్యోతి కుమారి, అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు వివరణాత్మకంగా నివృత్తి చేశారు. అనంతరం చంద్రయాన్–3 విజయవంతంగా చంద్రునిపై దిగాలని ఆకాంక్షిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి, ఉపాధ్యాయుడు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత


ధ్యానకేంద్రం వార్షికోత్సవంలో మాట్లాడుతున్న సీఐ రాము

పెదగంట్యాడ: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ సువ్వారి రాము అన్నారు. అహింస పిరమిడ్ ధ్యానకేంద్రం 13వ వార్షికోత్సవం సందర్భంగా నెల్లిముక్కులోని జీవీఎంసీ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస పెట్టడమేనన్నారు. మనిషికి ఓర్పు, సహనం రావాలంటే విధిగా ధ్యానం చేయాలని సూచించారు. ఏ విషయంలోనూ తొందరపాటు పనికిరాదన్నారు. మనసును అదుపులో పెట్టుకుంటే ఎటువంటి సమస్యలు ఉండవని, అలాగే చెడు ఆలోచనలు రావని వివరించారు. అనంతరం సీఐ రామును, 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్‌ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మన్మథరావు, ట్రస్ట్ ప్రతినిధులు శివ నాగేశ్వరరావు, రేవతి దేవి, ఇందిరా లక్ష్మి, రత్నకుమారి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఉక్కు కార్యదర్శికి వినతుల వెల్లువ

- ఉక్కు వ్యూహాత్మక అమ్మకం నిలిపివేయాలని వివిధ సంఘాల విజ్ఞప్తి


కేంద్ర ఉక్కు కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు కార్యదర్శి నాగేంద్ర నాథ్ సిన్హాకు ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఉక్కు పరిపాలన భవనంలో సీ ప్రధానకార్యదర్శి కె.వి.డి.ప్రసాద్ నేతృత్వంలో కలిసి స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. ఉక్కు అధికారులకు వేతన సవరణ చేసేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. సీ నాయకులు చంద్ర వెంకటేశ్వరరావు, నరసింహ, శ్రీనివాస్, ఎ.ఆర్.వి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పోరాట కమిటీ నాయకుల వినతి

స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకాన్ని నిలిపివేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కేంద్ర ఉక్కు కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ రుణాలను ప్రిఫరెన్షియల్ షేర్లుగా మార్చాలని, స్టీల్‌ప్లాంట్ నిలదొక్కుకునేలా ఆర్థిక సహకారం అందించాలని, స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి వ్యయం తగ్గించడానికి ముఖ్యమైన ఐరన్ ఓర్ గనులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

- స్టీల్‌ప్లాంట్ ఓబీసీ సంఘం నాయకులు అందజేసిన వినతిపత్రంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటైజేషన్ ఉపసంహరించాలని, ఉక్కు కార్మికులకు వేతన సవరణ అమలు చేయాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బి. అప్పారావు, నాయుడు, యు. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- బీఎంఎస్ నాయకులు అందజేసిన వినతిపత్రంలో ఉక్కు కార్మికులకు వేతన సవరణ అమలు చేయాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సిద్ధార్థ నగర్ సమస్యలు


ఎమ్మెల్యే నాగిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గాజువాక: జీవీఎంసీ 87వ వార్డు సిద్ధార్థనగర్ కాలనీలో సమస్యలను ఆ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి వివరించారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నేటి రమణ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. కాలనీ మొత్తాన్ని 22ఏ జాబితాలో నమోదు చేశారని, దీనివల్ల నివాసులు తమ ఆస్తులను అవసరానికి అమ్ముకోలేకపోతున్నారని, వారసులకు బదిలీ చేసుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించినవారిలో నాయకులు మార్టుపూడి పరదేశి, దరిగి రవి, పిట్టా రెడ్డి తదితరులున్నారు.

40వ రోజుకు ఎన్ఎంయూ నిరాహార దీక్షలు


స్టీల్ సిటీ డిపోలో దీక్షలో పాల్గొన్న కార్మికులు

ఉక్కునగరం: ఆర్టీసీ కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ డిపోలో ఎన్ఎంయూ కార్మికుల ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 40వ రోజుకు చేరుకున్నాయి. డిపో ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో జరుగుతున్న దీక్షను డిపో కార్యదర్శి జి. సాయిరామ్, జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.ఎస్.ఎస్.ఎం.రాజు, డిపో కోశాధికారి డి.ఎస్. వాసు, మూర్తి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సిక్‌లకు జీతాలు ఇవ్వాలని, గ్యారేజి, ట్రాఫిక్ వల్ల గంటల తరబడి లేటు అయిన సందర్భంగా ట్రిప్పు కేన్సిల్ చేయాలని, కార్మికులకు రావాల్సిన ఓటీ డబ్బులు, పే ఎరియర్స్ నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్షలో ఎస్.వాసు, కె.ఎస్.రాజు, జె.వి.వి.ఎస్.నారాయణ, ఎం.బొర్రయ్య కూర్చున్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్మికులు పలువురు పాల్గొన్నారు.

మరింత విస్తృతంగా 'మానవతా' సేవలు


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న కృష్ణంరాజు

గాజువాక: పేదలకు మానవతా స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలను మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆ సంస్థ చైర్మన్ దీనంకొండ కృష్ణంరాజు కోరారు. మంగళవారం నిర్వహించిన సంస్థ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాథ మృతదేహాలకు శాంతిరథం పంపించి వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్నిస్తున్నామని తెలిపారు. మెరిట్ విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో నగదు బహుమతులను అందజేసి ప్రోత్సహిస్తున్నామని, పర్యావరణ పరిరక్షణకు రకరకాల కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. సంస్థకు నూతనంగా ఎంపికైన కార్యవర్గం కూడా సేవా కార్యక్రమాలను విస్తృతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు ఎం.వి.సుబ్బరాజు, బలివాడ సత్యారావు, కోశాధికారి వి.ఆర్.కె.రాజు, కో చైర్మన్ డి.వి.ప్రసాదరావు, కన్వీనర్ సుంకరి నారాయణ ప్రసాద్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గాన్ని దెబ్బకొట్టే యత్నమే ప్రైవేటీకరణ


922వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన దీక్షల్లో 922వ రోజు మంగళవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం నిర్వహించారు.ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సింహగిరిపై ఘనంగా నృసింహ హోమం


నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: స్వాతి నక్షత్రం పురస్కరించుకుని సింహగిరిపై మంగళవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో నృసింహ హోమం నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి అక్కడ ఉన్న హోమగుండం వద్ద అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని అర్చకుడు శ్రీకాంతాచార్యులు తలపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. దేవస్థానం తరఫున ఉభయాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం అర్చకుడు పవన్‌కుమార్, వేదపండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌తోనే కార్మికులకు న్యాయం'

- జోరుగా భెల్ గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న ఇంటక్, సిటూ అలయన్స్ యూనియన్ వర్గాలు

అక్కిరెడ్డిపాలెం: భెల్ కార్మికుల హక్కులను సాధించాలంటే ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, వైఎస్సార్ టీయూసీ, ఏఐటీయూసీ అలయన్స్‌గా పోటీ చేయుచున్న ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌ను గెలిపించాలని అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న జి.టి.పి.ప్రకాష్, ప్రధాన కార్యదర్శి బరిలో నిలిచిన ఉరుకూటి బాబూరావు కోరారు. ఈ నెల 31న జరగనున్న భెల్ (హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ ఎన్నికల సందర్భంగా మంగళవారం సంస్థ ప్రధాన గేటు వద్ద ఆయా యూనియన్ల నాయకులు, కార్మికులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీయూసీ నాయకుడు ఎస్.నవీన్ కుమార్, రోమాల అప్పారావు, ఏఐటీయూసీ నాయకులు చిట్టిబాబు, ఎస్.వెంకట్రావు, సీతం నాయుడు, ఎస్.జగన్నాథరావు, కె.నారపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ' విజయవంతం చేయాలి

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 24న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం మస్టర్ పాయింట్ వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనే డిమాండ్‌లతో చలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీకి చెందిన పలువురు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు


లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: అర్హతే ప్రాతిపదికగా ప్రతీ గడపకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 86వ వార్డు భరత్‌నగర్–1 సచివాలయ పరిధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్న హామీలను పూర్తి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో సైతం భారీ మెజారిటీతో గెలిచి, మరెన్నో సంక్షేమ పథకాలతో చరిత్రను తిరగరాసే స్థాయికి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ఉండనుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, వాడపల్లి రామచంద్రరాజు, వెలుగుల పరశురాముడు, మాటూరి శ్రీనివాసరావు, చేగొండి శ్రీనివాసరావు, శ్రీనివాస్‌పట్నాయక్, యోహాన్, నిర్మల, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి


గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ గంగారావు, సీఐటీయు నాయకులు

ఉక్కునగరం: ఉద్యమకారునిగా, ప్రజావాణిగా కాలికి గజ్జె కట్టి ఆడిన ప్రజా ఉద్యమకారుడు గద్దర్ అని జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు అన్నారు. ప్రజా నాట్యమండలి, సాహితీ స్రవంతి సంస్థల ఆధ్వర్యంలో స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో 'స్వర నీరాజనం' పేరిట గద్దర్‌కు నివాళి అర్పించారు. సభలో ఆయన మాట్లాడుతూ 'కళ .. కళ కోసం కాదు, ప్రజల కోసం' అన్న స్ఫూర్తిని గద్దర్ కలిగించారన్నారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి జి.రమణ మాట్లాడుతూ గద్దర్ మృతి ప్రగతిశీల శక్తులకు తీరని లోటన్నారు. స్టీల్ సీఐటీయూ నాయకులు జె. అయోధ్యరామ్, యు.రామస్వామి, ఎస్. రామారావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు చెల్లూరి సాంబమూర్తి, కె.వి.రామారావు, కె.వి.ఎస్.మూర్తి రచించిన సత్యకామ రుషి శేషు సింగర కొండలు కవితా సంపుటి ప్రచురణను సీఐటీయు నాయకులు ఎస్.రామారావు, ఎం. కృష్ణారావు, సిహెచ్. నారాయణరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కృష్ణార్జున, కె.సత్యనారాయణ, గౌరీశంకర్, ఆర్. శ్రీనివాస్, జి.సత్యనారాయణ, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.